సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 17 । మార్చి । 2023



గ్రేడ్ దిగజారింది
పీహెచ్‌సీల పనితీరు, వసతుల కల్పన, మందుల అందజేత, రక్తపరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ప్రతినెలా ఇస్తున్న గ్రేడింగ్‌లో వైద్యశాఖ వెనుకంజలో ఉంటోంది.
8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,368
3 శాతం జీఎస్టీతో	రూ.5,529
నవర (8 గ్రా)	రూ.44,232



వాతావరణం
గురువారం గాలిలో 68 శాతం తేమ ఉంది. శుక్రవారం అకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులతోపాటు, ఒకటి, రెండుచోట్ల వడగళ్ల వాన పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేస్తున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో అమరజీవి చిత్రపటానికి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు గొప్ప త్యాగశీలి అన్నారు. ఆయన పేరును నెల్లూరు జిల్లాకు పెట్టడం పెట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి కనకదుర్గా భవాని, ఏపీఎం ఐపీ పీడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నెల్లూరు బ్యారేజీకి శ్రీనివాసులురెడ్డి పేరు
- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం



నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(అర్బన్): నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీగా నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 29ని గురువారం విడుదల చేసింది. ఈ బ్యారేజీ పేరు మార్పు గురించి వచ్చే ఆంధ్రప్రదేశ్ గెజిట్ సంచికలో ప్రచురిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత సంవత్సరం జిల్లాలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. జిల్లాకు ఎనలేని సేవ చేసిన మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరును నెల్లూరు బ్యారేజీకి పెట్టాలని ఆ సమయంలో సీఎంకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతో కలెక్టర్ చక్రధర్‌బాబు, ఇంజినీర్ ఇన్ చీఫ్ అధికారి ఆ పేరును సూచిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో ప్రభుత్వం ఆమోదించి జీఓను విడుదల చేసింది. దీంతో సీఎంకు కోవూరు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

బుచ్చి విద్యార్థిని ప్రతిభ



యామిని

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి చెందిన తుమ్మల యామిని నీట్ పీజీ–2023 ఆలిండియా 353 ర్యాంక్ సాధించింది. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ప్రభుత్వ టీచర్ తుమ్మల గోపాల్, అరుణాదేవి కుమార్తె అయిన యామిని ప్రాథమిక విద్యను స్థానికంగా ఉన్న వివేకానంద పాఠశాలలో, ఇంటర్ విద్యను నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివింది. ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ–2023 పరీక్షలో 800 మార్కులకు గానూ 652 మార్కులు సాధించి ఆలిండియాలో 353వ ర్యాంకును పొందింది. తాను భవిష్యత్‌లో కార్డియాలజీ వైద్యురాలుగా సేవలందిస్తానని యామిని తెలిపింది. ఆమెను గురువారం ఉపాధ్యాయులు, అధ్యాపకులు, స్నేహితులు అభినందించారు.

2,742 పొగాకు బేళ్ల విక్రయం



పొగాకు బేళ్లు (ఫైల్)

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం వేలానికి 775 బేళ్లు రాగా వాటిలో 754 బేళ్లను విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మిగిలిన 21 బేళ్లలో 4 నోసేల్, 10 నోబిడ్, 1 ఆర్ఆర్, 6 సీఆర్‌గా గుర్తించామన్నారు. 98,995 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.1,95,45,141 వ్యాపారం జరిగింది. ఒక కిలోకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.191, సగటున ధర రూ.197.44 లభించింది. వేలంలో 6 కంపెనీలు పాల్గొన్నాయి.

- కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 1,988 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 2,163 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 180 బేళ్లను తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.190, సగటున ధర రూ.198.11 ధర లభించింది. వేలంలో 6 కంపెనీలు పాల్గొన్నాయి.

నిధుల వరద



వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అండగా నిలిచింది. వారికి ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సంగం, నెల్లూరు బ్యారేజీ నిర్మాణాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించి పనులు చేయించి ప్రారంభించారు. తాజాగా గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అధికంగా నిధులిచ్చింది. దీనిపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వివిధ శాఖలకు జరిగిన కేటాయింపులు బాగున్నాయని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

- బడ్జెట్‌లో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం
- ప్రాజెక్టులకు భారీగా కేటాయింపులు
- జిల్లా అన్నదాతలకు అండగా ప్రభుత్వం
- వివిధ పథకాలకు భారీగా నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో అధికశాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అన్నదాతలకు సాగునీరు అందించడంలో సోమశిల, కండలేరు ప్రాజెక్టులు ఎంతో కీలకం. ఈ రెండింటి పరిధిలో ఉమ్మడి జిల్లాలో సుమారు పదిలక్షల ఎకరాలు సాగులో ఉంటాయని అంచనా. వీటికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం అధికంగా కేటాయింపులు చేసింది. సోమశిల జలాశయం అభివృద్ధికి రూ.41.4 కోట్లు మంజూరయ్యాయి. వరద రక్షణ పనులతోపాటు హైలెవల్ కాలువ మొదటి, రెండో దశ పనులకు, ఉత్తర, దక్షిణ కాలువలతోపాటు కావలి కాలువ అభివృద్ధికి ఈ నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

కండలేరు ఎత్తిపోతల పథకానికి

కండలేరు జలాశయం నుంచి ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు ఎడమ లిఫ్ట్ కెనాల్ ఉంది. జలాశయం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు. ప్రత్యక్షంగా, చెరువుల ద్వారా సుమారు 24,700 ఎకరాలకు సాగునీరు అందించేలా దానిని స్థిరీకరించారు. కాగా ఈ కాలువ ద్వారా సాగునీరు అందించాలంటే కండలేరులో కనీసం 31 టీఎంసీలు ఉంటేనే సాధ్యమవుతుండేది. నీటి నిల్వ అంత కంటే తక్కువగా ఉన్న సమయంలో సాగునీటి విడుదల ప్రశ్నార్థకమయ్యేది. దీంతో జలాశయంలో నీరున్నా స్థానిక రైతులు కొందరు వినియోగించుకునే పరిస్థితి లేదు. ఈ క్రమంలో ఎడమకాలువకు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రత్యేక లిఫ్టును ఏర్పాటు చేశారు. దీంతో కండలేరు జలాశయం డెడ్ స్టోరేజ్ (8.4 టీఎంసీలు)లో ఉన్నా కూడా ఎడమ కాలువ ద్వారా సాగు, తాగునీటిని పొదలకూరు తదితర మండలాలకు అందించే సౌలభ్యం ఉంది.

జనరంజకం
అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జనరంజక బడ్జెట్ ద్వారా పేదల వైద్యానికి భరోసా కల్పించారు. అన్నదాతలకు అండగా నిలిచారు. అక్కచెల్లెమ్మల ఉన్నతికి చేయూతనందించారు. ప్రభుత్వ కేటాయింపుల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. స్థిరమైన సమసమాజ ఆర్థికాభివృద్ధి, అన్ని వర్గాల సాధికారత శ్రేయస్సుకు అద్దం పడుతోందని ఆర్థికరంగ నిపుణులు చెబుతున్నారు. సాగు ప్రాజెక్టులు, విద్య, ఆరోగ్యం, సంక్షేమం, ఉపాధి అవకాశాలు, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారని వివరిస్తున్నారు.

ప్రాజెక్టు	కేటాయింపులు (రూ.కోట్లలో)
వెలిగొండ ప్రాజెక్ట్	రూ.101.47
సోమశిల రిజర్వాయర్	రూ.41.00
పెన్నా డెల్టా వ్యవస్థకు	రూ.77.54
తెలుగుగంగ	రూ.232.08
కండలేరు ఎత్తిపోతల	రూ.11.54
సోమశిల - స్వర్ణముఖి లింక్ కెనాల్	రూ.41.92

పథకాలు – నిధులు (అంచనా మేరకు..)

	లబ్ధిదారులు (లక్షల్లో)	లభించే మొత్తం (రూ.కోట్లలో)
రైతు భరోసా	2.43	రూ. 184.30
వైఎస్సార్ పెన్షన్ కానుక	3.62	రూ. 1,116.24
అమ్మఒడి	2.65	రూ.397.5
9 గంటల ఉచిత విద్యుత్	1.99	రూ.365.34
మత్స్యకార భరోసా	0.142	రూ.14.26
వసతి దీవెన	0.636	రూ.78.17
విద్యా దీవెన	0.631	రూ.130
జగనన్న తోడు	82,506 గ్రూపులు	రూ.81.69
సున్నా వడ్డీ	50,460 గ్రూపులు	రూ.126.27
ఆసరా	39,726 గ్రూపులు	రూ.539.78 కోట్లు
పంటల బీమా	0.068	రూ.3.06
సున్నా వడ్డీ	0.066	రూ.1.24
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	0.62	రూ.119



సోమశిల - స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు..
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా రూ.550 కోట్లతో సోమశిల – స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వం కాలువ అభివృద్ధిని మరిచింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పనులు పునః ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రూ.770 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. తిరుపతి జిల్లా అల్లూరుపాడు సమీపంలో ఉన్న కండలేరు – పూండి ప్రధాన కాలువ (సత్యసాయిగంగ కాలువ) నుంచి ఏర్పేడు సమీపంలో మేర్లపాక గ్రామం వరకు సోమశిల – స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులు 44.42 కిలోమీటర్ల మేర జరుగుతున్నాయి. దీని కోసం తాజాగా రూ.41.92 కోట్లు కేటాయించారు.



సోమశిల - స్వర్ణముఖి లింక్ కెనాల్ (ఫైల్)

550 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తయితే సుమారు 2.5 లక్షల మందికి తాగునీరు అందుతుంది. దీంతోపాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా 90,764 ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారు.

నాడు-నేడు పథకానికి కేటాయింపులు



మనబడి నాడు–నేడు పథకానికి వార్షిక బడ్జెట్లో రూ.3,500 కోట్ల మేర కేటాయింపులు జరగడం శుభపరిణామం. ఇందువల్ల వేలాది బడులు చక్కగా రూపాంతరం చెందుతాయి.

– కె.సనత్‌కుమార్, హెచ్‌ఎం, డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్, పొదలకూరు

రైతు బిడ్డని నిరూపించుకున్న మంత్రి



ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించి చిన్న చిన్న పద్దులు కూడా ప్రత్యేకంగా కేటాయింపులు చేసి రైతు బిడ్డని నిరూపించుకున్నారు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. మరో రెండు శాతం నిధులు అదనంగా కేటాయించి రైతుల మనసులో నిలిచిపోవాలి.

– చిరసాని కోటిరెడ్డి, రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

అభినందనీయం



విద్యారంగంలో అమలవుతున్న సంక్షేమానికి నిధులు కేటాయించడం అభినందనీయం. మనబడి, నాడు–నేడు, విద్యాకానుక, అమ్మఒడి తదితర వాటికి నిధులివ్వడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెరిగిన దృష్ట్యా నాడు–నేడులో భాగంగా అదనపు గదులు నిర్మాణాలు పూర్తి కావడానికి మరిన్ని నిధులు ఇవ్వాల్సి ఉంది.

– సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్ బాగుంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగుంది. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ నాడు–నేడు పథకానికి అధికంగా కేటాయించడం మంచి పరిణామం. తొలి నుంచి ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోంది.

– జీవీ నారాయణరావు, విశ్రాంత హెచ్‌ఎం, ఆత్మకూరు

అన్ని వర్గాలకు ప్రాధాన్యం



బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ కేటాయింపులు చేయడం బాగుంది. ముఖ్యంగా పరిశ్రమలు, వాణిజ్యానికి అధిక నిధులిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులకు చేసిన కేటాయింపులు బాగున్నాయి.

– నోటి వెంకటేశ్వర రెడ్డి, ఆత్మకూరు సిటిజెన్ ఫోరం నిర్వాహకుడు

ప్రజల ప్రాణాలు రక్షించడమే లక్ష్యం
- ఎస్పీ సీహెచ్ విజయారావు

నెల్లూరు(క్రైమ్): 'జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా రోడ్డు భద్రత (హైవే మొబైల్) సిబ్బంది విధులు నిర్వహించాలి.' అని ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో రోడ్డు భద్రత సిబ్బందికి గురువారం ఆయన రేడియం జాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైట్ పెట్రోలింగ్ విజిబిలిటీ కోసం తప్పనిసరిగా రేడియం జాకెట్లను ధరించి టార్చ్, రేడియం లైట్లను ఉపయోగించాలన్నారు. హెల్ప్ లైన్ ద్వారా అందే కాల్స్‌కు తక్షణమే స్పందించి రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సకాలంలో హాస్పిటల్‌కు తరలించాలన్నారు. జాతీయ రహదారి వెంబడి ధాబాలు, హోటల్స్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రేడియం జాకెట్లు ధరించిన రోడ్డు భద్రత సిబ్బంది

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం



నెల్లూరు నారాయణ జూనియర్ కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు



సంగం: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

- నలుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం జిల్లా వ్యాప్తంగా 95 సెంటర్లలో ప్రారంభమయ్యాయి. జనరల్‌కు సంబంధించి 24,362 మంది విద్యార్థులకు గానూ 23,827 మంది హాజరయ్యారు. 535 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,703 మందికి గానూ 1,588 మంది హాజరయ్యారు. 115 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ చక్రధర్‌బాబు అరవింద్‌నగర్‌లోని నారాయణ, వివేకానంద జూనియర్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారి శేషుకుమారి ఆత్మకూరు, మర్రిపాడుల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆత్మకూరులో ముగ్గురు, మర్రిపాడు ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండడంతో కేసులు నమోదు చేశారు. ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, డీవీఈఓ మధుబాబు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు 79 కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష రాస్తూ స్పృహ తప్పిన విద్యార్థిని

- ఆస్పత్రికి తీసుకెళ్లిన ఆత్మకూరు ఎస్సై
- చికిత్స అనంతరం తిరిగి పరీక్షకు..

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని జ్వరంతో బాధపడుతూ పరీక్ష హాల్లో స్పృహ తప్పి పడిపోయింది. బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి తిరిగి పరీక్ష కేంద్రానికి చేర్చారు. ఈ ఘటన ఆత్మకూరులో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు స్రవంతి అనే విద్యార్థిని గురువారం హాజరైంది. ఆమె జ్వరంతో బాధపడుతోంది. ఈక్రమంలో పరీక్ష రాస్తూ ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్సై ఎం.శివశంకర్రావు విషయం తెలుసుకుని స్రవంతిని తన వాహనంలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లి సొంత ఖర్చులతో చికిత్స చేయించి తిరిగి పరీక్ష కేంద్రానికి చేర్చారు. వెంటనే స్పందించి మానవత్వంతో విద్యార్థినికి చికిత్స చేయించిన ఎస్సైని లెక్చరర్లు అభినందించారు. స్రవంతి తల్లి రమణమ్మ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థినికి చికిత్స చేయిస్తున్న ఎస్సై శివశంకర్రావు

క్షణక్షణం ఉత్కంఠ

- అర్ధరాత్రి దాటే వరకు కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- మొదటి ప్రాధాన్యత ఓట్లలో వైఎస్సార్‌సీపీ టీచర్ అభ్యర్థికి ఆధిక్యం
- రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టిన అధికారులు

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్: తూర్పు రాయలసీమ పరిధిలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చిత్తూరుకు సమీపంలోని ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సెక్షన్ ఆఫీసర్లు రోహిత్ కుమార్, సౌరభ్ రానా, దీపక్‌కుమార్, అబ్జర్వర్‌లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్, బరిలోని అభ్యర్థుల సమక్షంలో ఉదయం 7 గంటలకు స్ట్రాంగ్ రూములను తెరిచారు. రిటర్నింగ్ అధికారి, చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు.

టీచర్ ఎమ్మెల్సీకి..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కి సంబంధించి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 24,741 ఓట్లను 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టే ప్రక్రియ కొనసాగింది. వాటిని 14 టేబుళ్లకు పంపిణీ చేశారు. ఒక్కో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున 14 టేబుళ్లకు 7,000 ఓట్లను అందజేశారు. నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. కాగా ఓట్ల లెక్కింపు గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉండడంతో క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. అర్ధరాత్రి వరకు అందిన సమాచారం మేరకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి ముందంజలో నిలిచారు.

మొదటి రౌండ్ నుంచే..

చంద్రశేఖర్‌రెడ్డి మొదటి రౌండ్ నుంచే ఆధిక్యత చూపారు. నాలుగు రౌండ్లలో ఆయనకు 10,862 ఓట్లు నమోదయ్యాయి. పీడీఎఫ్ అభ్యర్థి బాబురెడ్డికి 8,908 ఓట్లు వచ్చాయి. ఈ ఇద్దరి మధ్య పోటీ కొనసాగింది. ప్రతి రౌండ్‌లోనూ చంద్రశేఖర్‌రెడ్డి ఆధిక్యం కనబరిచారు. పోటీలో ఉన్న మరో ఆరుగురు అభ్యర్థుల్లో శ్రీరామమూర్తికి 325, కుట్టబోయిన బ్రహ్మానందానికి 623, ధనంజయ శివయోగికి 31, పర్వతనేని ప్రవీణకు 36, ఎల్‌సీ రమణారెడ్డికి 3,465, లక్కు అనసూయకు 41 ఓట్లు పడ్డాయి. నాలుగు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి ఏ అభ్యర్థికీ 50 శాతానికి పైన ప్రాధాన్యత ఓట్లు నమోదు కాలేదు. దీంతో రాత్రి 10.30 గంటలకు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోంది.



కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు



ఏజెంట్ల సమక్షంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

చెల్లని ఓట్లే 450

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లే 450 నమోదయ్యాయని అధికారులు ప్రకటించారు. ఎన్నికల్లో 27,694 ఓట్లకు గానూ 24,741 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 24,291 ఓట్లు చెల్లుబాటు అయ్యాయని అధికారులు తెలిపారు. కొంతమంది టిక్‌లు, రెండుసార్లు 1 సంఖ్య వేయడం, ఒకటో ప్రాధాన్యత ఓటు వేయకుండా నేరుగా రెండో ప్రాధాన్యత ఓటు నుంచి వేయడం.. ఇలాంటి పలు తప్పిదాలు చేశారని కౌంటింగ్ అధికారులు గుర్తించారు.

నలుగురు అభ్యర్థుల తొలగింపు

ఎన్నికల బరిలో 8 మంది అభ్యర్థులు నిలిచారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మొదటి ప్రాధాన్యత కింద 50 శాతానికి పైగా ఓట్లు నమోదు కాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు ప్రారంభమైంది. ఈక్రమంలో పోలైన ఓట్లలో తక్కువ వచ్చిన అభ్యర్థుల తొలగింపు ప్రక్రియ నిర్వహించారు. ధనంజయ శివయోగి, ప్రవీణ పర్వతరెడ్డి, లక్కు అనసూయ, శ్రీరామమూర్తి, కట్టుబోయిన బ్రహ్మానందంను తొలగించారు. వారికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికైతే వేశారో ఆ అభ్యర్థులకు వాటిని కలుపుతూ పోతారు. ఆ ఓట్లను ముందంజలో ఉన్న అభ్యర్థులకు కలిపే ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి పోలైన ఓట్లలో సగభాగం కంటే ఎక్కువ వచ్చే వరకు కలుపుతారు. చివరికి ఏ అభ్యర్థికైతే ఆధిక్యం వస్తుందో వారిని విజేతగా ప్రకటిస్తారు.

పట్టభద్రుల కౌంటింగ్ సాయంత్రం ప్రారంభం
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,69,023 ఓట్లు నమోదయ్యాయి. వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఉదయం ఏడు గంటలకే కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలైన ఓట్లను బ్యాలెట్ బాక్స్‌ల నుంచి బయటకు తీసి డ్రమ్ముల్లో కుమ్మరించారు. పట్టభద్రులకు లక్షల్లో ఓట్లు నమోదు కావడంతో 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టేందుకు 13 గంటల వరకు సమయం పట్టింది. దీంతో సాయంత్రం 5.30 గంటలకు మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపును మొదలుపెట్టారు. ఆ కౌంటింగ్‌కు 40 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 1,000 ఓట్ల చొప్పున ఒక రౌండ్‌కు 40,000 ఓట్లను లెక్కించేలా అధికారులు చర్యలు చేపట్టారు. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. మొత్తం ఏడు రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఈ ప్రక్రియ రెండోరోజు కూడా కొనసాగనుంది.



కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ

క్లుప్తంగా

ఈ-క్రాప్ ఉంటేనే రైతులకు రుణాలు

- జేడీ సుధాకర్‌రాజు



రికార్డులు పరిశీలిస్తున్న జేడీ సుధాకర్‌రాజు

మనుబోలు : రైతులు పంట రుణాలు పొందాలంటే ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుని ఉండాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్‌రాజు అన్నారు. మనుబోలు, జట్లకొండూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యానికి అధిక ధర లభించిందన్నారు. షుగర్ లెస్ ధాన్యానికి ఎక్కువ డిమాండ్ ఉందని తెలిపారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల పేర్లను సోషల్ ఆడిట్ పోస్టుల నోటీస్ బోర్డులో ఉంచారా లేదా అని పరిశీలించారు. నోటీస్ బోర్డులో పేర్కొన్న రైతులకు సంబంధించి ఏమైనా తప్పులు ఉంటే సరి చూసుకోవాలన్నారు. అభ్యంతరాలు ఉంటే వీఏఏలను కలిసి సరి చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ ఉన్నారు.

స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఆయిల్ అండ్ నేచరల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) స్పోర్ట్స్ డివిజన్ వారు 2023-24 సంవత్సరానికి ప్రతిభ గల క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఆర్థిక సాయం చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని జిల్లా సెట్నల్ సీఈఓ, డీఎస్‌ఏ పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతిభావంతులైన భావి క్రీడాకారులు ఓఎన్‌జీసీ అధికార వెబ్‌సైట్ https://sportsscholarship.ongc.co.in ను సందర్శించి నిబంధనలు పరిశీలించి ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కందుకూరు : స్కూల్ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సింగరాయకొండ రోడ్డులోని మాల్యాద్రికాలనీ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని నల్లమల్లివారితోటకు చెందిన మందలపు మోహన్‌రావు, శారద దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో సాయిచరణ్ (27) మొదటివాడు. ఇతనికి ఏడు నెలల క్రితం వివాహమైంది. తండ్రి లారీ యజమాని కావడంతో వాటి మెయింటెనెన్స్ పనులను సాయిచరణ్ చూసుకుంటున్నారు. కాగా తండ్రిని కలిసేందుకు గురువారం ఓవీ రోడ్డులోని లారీ స్టాండ్ వద్దకు వెళ్లాడు. అనంతరం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై సింగరాయకొండకు బయలుదేరాడు. మాల్యాద్రికాలనీ సమీపంలోకి వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న శ్రీవిద్య స్కూల్ బస్సు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికందొచ్చిన కొడుకు అకస్మాత్తుగా మరణించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. రూరల్ ఎస్సై శివనారం చారయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 109
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 216
లేయర్ చికెన్	: 128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.30



పిట్ట కొంచెం.. ఆట ఘనం

ఏడేళ్ల బుడతడు చెస్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. అందరి చిన్నారుల్లా సెల్‌ఫోన్‌తో కాలాన్ని వృథా చేయకుండా ఒకవైపు చదువుకుంటూ మరోవైపు దొరికిన సమయాన్ని చెస్ ఆటకు కేటాయిస్తూ జిల్లా స్థాయి పోటీల్లో రాణించి అందరి మన్ననలు పొందుతున్నాడు. తన ఆటతీరుతో రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణిస్తాడని తల్లిదండ్రులు, కోచ్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- చెస్‌లో రాణిస్తున్న చిచ్చర పిడుగు
- ఆట మొదలుపెట్టిన మూడు నెలలకే జిల్లా స్థాయికి..
- 8 నెలలకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఇంట్లో అమ్మమ్మ, తాతయ్యతో కలిసి చెస్ సాధన చేస్తున్న చిన్నారి మురళీశంకర్‌రెడ్డి



చిన్నారికి అభినందనలు తెలుపుతున్న సెట్నల్ సీఈఓ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం



మెడల్‌తో మురళీశంకర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు వేదాయపాళెంలోని త్యాగరాజ మందిరం సమీపంలో నివాసం ఉండే కె.పెంచల నర్సింహారెడ్డి, కల్పన దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద అబ్బాయి రూపేష్‌రెడ్డి ఐదో తరగతి చదువుతున్నాడు. రెండో అబ్బాయి మురళీశంకర్‌రెడ్డి ఒకటో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులకు తమ బిడ్డలను క్రీడల్లో కూడా రాణించాలని భావించారు. పెద్దవాడికి చెస్‌పై ఉన్న మక్కువను గమనించి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ 2002 సమ్మర్ కోచింగ్‌కు పంపించారు. పెద్దబ్బాయి చెస్ ఆడుతుంటే నేను వెళ్తానంటూ తమ్ముడు మారం చేయడంతో మురళీశంకర్‌రెడ్డిని కూడా కోచింగ్‌కు పంపారు. గత ఏడాది వేసవిలో అన్నతో చెస్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌కు హాజరయ్యాడు. కోచ్ నవీన్ పర్యవేక్షణలో మూడు నెలలకే జిల్లాస్థాయి టోర్నీలో ఆడడం ప్రారంభించాడు. ఏడు నెలల్లో 22 టోర్నమెంటుల్లో తలపడితే 12కు పైగా టోర్నీల్లో పతకాలను, ప్రత్యేక ప్రతిభా పురస్కారాలను అందుకున్నాడు. ఇటీవల కోవూరులో జరిగిన అండర్-7 పోటీలో జిల్లా స్థాయిలో రెండోస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జూన్‌లో విజయనగరంలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి.

తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్య ప్రోత్సాహంతో మురళీ చెస్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. ప్రతిపోటీలో తనను తాను మెరుగు పరుచుకుంటూ ఇతర క్రీడాకారులను సైతం ఆశ్చర్య పరుస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లి వచ్చిన తర్వాత అమ్మమ్మతో పాటు అన్నదమ్ములు ఇంట్లోనే చెస్ సాధన చేయడం వీరి ప్రత్యేకత. చదువులు, ఇంట్లో చెస్ ఆడడం తప్ప మరే ఆలోచన లేకపోవడంతో పిల్లలు చెస్‌లో రాణిస్తున్నారని తల్లి కల్పన తెలిపింది. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది.

గ్రేడ్ దిగజారింది

- పీహెచ్‌సీల సేవల్లో జిల్లా వైద్యశాఖ వెనుకంజ

నెల్లూరు (అర్బన్) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, వసతుల కల్పన, మందుల అందజేత, రక్తపరీక్షల నిర్వహణ తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ఇస్తున్న గ్రేడింగ్‌లో జిల్లా వైద్యశాఖ ఇటీవల కాలంలో వరుసగా వెనుకంజలో ఉంటోంది. గతంలో ముందు వరుసలో ఉండే వైద్యశాఖ గత కొన్ని నెలలుగా ర్యాంకింగ్‌లో బాగా దిగజారింది. కాగా జిల్లాలోని వలేటివారిపాలెం పీహెచ్‌సీ రాష్ట్రంలో 279వ స్థానం రాగా జిల్లాలో ఇదే ప్రథమ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే అంశం.

కొన్ని వందల్లో..

రాష్ట్రస్థాయిలో జిల్లా పీహెచ్‌సీలు వందల ర్యాంకుల్లో నిలిచి బాగా వెనుకబడి ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల ప్రతి పీహెచ్‌సీలో 14 మంది డాక్టర్లు, సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇద్దరు డాక్టర్లు ఉంటారు. ఒక డాక్టర్ ఓపీ సేవలు చూడాలి. మరో డాక్టర్ ఫ్యామిలీ ఫిజీషియన్ కింద గ్రామాల్లోకి వెళ్లి వైద్య సేవలు అందించాలి. ఇంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ నెల్లూరు జిల్లా వెనుకబాట పట్టింది. అయితే ఫిబ్రవరి నెలలో నిర్వహించిన గ్రేడింగ్‌లో జిల్లాలోని కందుకూరు డివిజన్ వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదటి స్థానంలో నిలువగా కలువాయి పీహెచ్‌సీ రెండో స్థానంలో నిలిచింది. గత నెలలో జిల్లాలో మొదటి స్థానంలో ఉన్న రామతీర్థం పీహెచ్‌సీ ఈ దఫా మూడో స్థానానికి పరిమితమైంది.

లోక్‌అదాలత్‌లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

నెల్లూరు(లీగల్) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రారంభించనున్న శాశ్వత లోక్‌అదాలత్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పలు పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ జిల్లా చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి యామిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో హెడ్ క్లర్క్ జీతం రూ.44,570 కాగా న్యాయశాఖలో ఉద్యోగ విరమణ చేసిన వారు లేదా తత్సంబంధ విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన వారు, పైవిధుల్లో సమయస్ఫూర్తితో ఉద్యోగ సేవలు అందించిన వారికి ప్రాధాన్యం ఉంటుందని, 70 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. స్టెనో కమ్ టైపిస్టు జీతం రూ.25,220 కాగా ఇంగ్లిష్‌లో షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత కలిగి పట్టభద్రులు లేదా హయ్యర్ గ్రేడ్ షార్ట్ హ్యాండ్ ఉత్తీర్ణత ఉండాలని, లేనిపక్షంలో లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణులను అనుమతించనున్నామని తెలిపారు. ఇంగ్లిష్ టైప్ రైటింగ్, హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత కలిగిన వారు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. గరిష్ట వయోపరిమితి 35 ఏళ్లు ఉండాలి. టైపిస్టు కమ్ అసిస్టెంట్ జీతం రూ.25,220 కాగా ఆంగ్లంలో టైప్ రైటింగ్, హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత కలిగి పట్టభద్రులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, వయో పరిమితి 35 ఏళ్లు ఉండాలి. పై రెండింటిలో వెనుకబడిన తరగతుల వారికి, ఇతర అర్హతలు ఉన్న వారికి సడలింపులు ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందించాలన్నారు.

ప్రేమ పేరిట మోసం

- ఓ యువతితో ప్రేమాయణం
- మరో యువతితో పెళ్లికి సిద్ధపడిన వైనం
- అడ్డుకున్న బాధితురాలు

నెల్లూరు(క్రైమ్) : ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని నమ్మించాడు. అయితే వారం రోజులుగా పత్తాలేడు. మరో యువతితో వివాహానికి సిద్ధపడ్డాడు. దీనిపై ప్రేమికుడి స్నేహితుడు ఆమెకు మెసేజ్ చేశాడు. దీంతో బాధిత యువతి గురువారం వివాహ ప్రాంతానికి వెళ్లి ప్రియుడిని, అతని తల్లిదండ్రులను నిలదీయడంతో వారు అక్కడి నుంచి జారుకున్నారు. పోలీసులు, బాధితురాలి వివరాల మేరకు.. నగరంలోని ఎంజీమాల్ ప్రాంతానికి చెందిన డి.అభిషేక్ ఓ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తూ ఇటీవల ఉద్యోగానికి రిజైన్ చేశాడు. కొండాయపాళెం గేటు సమీపంలో ఉంటున్న ఓ యువతితో అభిషేక్‌కు ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. కొంతకాలంగా యువతి గొలగమూడిలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుండటంతో ప్రతిరోజు అభిషేక్ ఆమె వద్దకు వెళ్లేవాడు. ఈ క్రమంలోనే వారిద్దరూ ఒక్కటయ్యారు. వారం రోజుల కిందట నీవు ఎప్పుడు నవ్వుతూ ఉండాలని యువతికి చెప్పి అతను వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని జాడ లేదు. ఫోన్ నంబర్‌ను పనిచేయడం లేదు. అతని ఇంట్లో వాళ్లకు యువతి ఫోన్ చేసినా స్పందన లేదు. ఇంతలో బుధవారం రాత్రి ప్రేమికుడి ఫ్రెండ్ నుంచి యువతికి మెసేజ్ వచ్చింది. అభిషేక్‌కు ఫత్తేఖాన్‌పేటలోని ఓ చర్చిలో గురువారం వివాహమని, నీ జీవితం నాశనం కాకుండా చూసుకోవాలని మెసేజ్‌లో ఉంది. దీంతో బాధితురాలు గురువారం చర్చి వద్దకు వెళ్లింది. అభిషేక్ తల్లిదండ్రులు, బంధువులు వివాహ ఏర్పాట్లు చేస్తుండటంతో వారిని అడ్డుకుని తనకు జరిగిన అన్యాయంపై నిలదీసింది. వివాహమైన తర్వాత మాట్లాడుకుందామని వారు సమాధానం దాటేశారు. దీంతో బాధితురాలు చిన్నబజారు పోలీసుల వద్దకు వెళ్లి ప్రేమ విషయాన్ని తెలియజేసింది. పోలీసులు యువతిని వెంటబెట్టుకుని వివాహాన్ని నిలిపివేశారు. ఇంతలో అభిషేక్‌తో పాటు అతని తల్లిదండ్రులు, బంధువులు అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. తనను ప్రేమించిన అభిషేక్‌తోనే తన వివాహం జరిపించి న్యాయం చేయాలని యువతి కోరారు. ఈ మేరకు దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..



వీఎస్‌యూలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.సంపత్‌కుమార్ కొనియాడారు. మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నతనం నుంచే దేశభక్తిని పుణికి పుచ్చుకున్న పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్‌యూలో

మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని పోరాడి, ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తూరు ఏఈపై విచారణకు ఆదేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఇందుకూరుపేటలోని కొత్తూరు సెక్షన్‌లో విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ)గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరాజుపై ఇటీవల పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారం ఆ ప్రాంత రైతులు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కలిసి ఏఈపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. దీంతో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య కొత్తూరు ఏఈపై విచారణకు ఆదేశించారు. ఆత్మకూరు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.జనార్దన్‌ను విచారణ అధికారిగా నియమించారు. నివేదిక ఆధారంగా కొత్తూరు ఏఈ వెంకటేశ్వరరాజుపై చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలియచేశారు.

విజిలెన్స్ విచారణ

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరాజుపై విజిలెన్స్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సాంబశివరావు కొత్తూరుకు విచ్చేసి అవినీతి ఆరోపణలపై విచారించారు. సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు, అధికారులతో వివిధ అంశాలపై ఆరా తీశారు.

జాతీయ మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : 69వ జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కబడ్డీ ఎంపికలను ఈనెల 19న విజయవాడలోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా సెట్నల్ సీఈఓ, డీఎస్‌ఏ అధికారి డి.పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయని, పోటీల్లో పాల్గొనే మహిళా క్రీడాకారులు 75 కిలోల్లోపు బరువు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు వైద్యశాఖ ఉద్యోగినిపై విచారణ

నెల్లూరు (అర్బన్) : జిల్లా వైద్యారోగ్య శాఖలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగినిపై ఈనెల 18న(శనివారం) విచారణ జరపనున్నారు. ఆమె ప్రమోషన్ల జాబితాలో ఉంది. అయితే భర్త డెత్ సర్టిఫికేట్ జత చేయడంలో నిబంధనలను ఉల్లంఘించారు. దీంతో ఆమెను ఇటీవలే సస్పెండ్ చేశారు. దీనిపై క్షుణ్ణంగా పరిశీలించేందుకు ప్రభుత్వం పల్నాడు జిల్లాకు చెందిన అడిషనల్ డీఎంహెచ్‌ఈ డాక్టర్ పద్మావతిని విచారణాధికారిగా నియమించింది. దీంతో డాక్టర్ పద్మావతి ఈ విషయమై శనివారం విచారణ చేపట్టనున్నారు.